అంకితభావంతో విధులు నిర్వహించాలి

పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

రెబ్బెన, అక్టోబర్ 30 : పోలీస్ శాఖ విధులు అత్యంత బాధ్యతయుతమైనవని, అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రెబ్బెన పోలీస్‌స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, దర్యాప్తు వివరాల గురించి ఎస్ఐ చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో రోజువారీగా నమోదవుతున్న ఫిర్యాదులు, కేసుల రికార్డులను పరిశీలించారు. రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారేక్, టెక్నికల్ రూం పరిసరాలు, రిసెప్షన్ డైరీ పరిశీలించిన అనంతరం సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందించారు. కోర్టు విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ లావుడ్య పరమేశ్వర్‌కు ఉత్తమ విధులకు ప్రోత్సాహకంగా క్యాష్ రివార్డు అందించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ కరణాకర్, సీఐ బుద్దె స్వామి, ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

సెంట్రల్, హైమాస్ట్ లైటింగ్ సిస్టం ప్రారంభం

హైమాస్ట్ లైటింగ్ సిస్టం ప్రారంభిస్తున్న చైర్మన్ ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 30 : మంచిర్యాల మున్సిపాలిటీ పరిధి ముకరాం చౌరస్తాలో రూ.5 లక్షల జనరల్ ఫండ్ నిధులతో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైటింగ్ సిస్టం, రైల్వే అండర్ బ్రిడ్జికి ఇరువైపులా రూ.11 లక్షల జనరల్ ఫండ్‌తో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టంను బుధవారం మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య ప్రారంభించారు. అండర్‌బ్రిడ్జికి రెండు వైపులా రాత్రిపూట రాకపోకలు సాగించేవారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ముకరాం చౌరస్తాలో కొత్తగా హైమాస్ట్ సిస్టంను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతానికి కొత్త శోభ సంతరించుకున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

నస్పూర్, అక్టోబర్ 30 : ఇంటింటి సమగ్ర సర్వే కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో మున్సిపల్ రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా గణాంక అధికారి సత్యం, ముఖ్య ప్రణాళిక అధికారి మహ్మద్ ఖాసీంతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో ఒక బ్లాక్ కింద 150 నుంచి 175 కుటుంబాలు కేటాయించి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు, ఏఈవోలు, పంచాయతీ, ఈజీఎస్ ఆపరేటర్లు, అంగన్‌వాడీ టీచర్లు, అతిథి అధ్యాపకులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. 10 ఎన్యుమరేషన్ బ్లాక్‌లకు డేటా సేకరణ పర్యవేక్షించేందుకు ఒక సూపర్ వైజర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. సర్వే ప్రక్రియలో రోజూ వారి పురోగతిని అదే రోజు సాయంత్రం 6 గంటల్లోపు ప్రణాళిక శాఖకు అందించాలని, నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

సిర్పూర్(టీ), అక్టోబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ఉచితంగా అందిస్తున్న చేపపిల్లల పథకంను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని సిర్పూర్(టీ) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు సూచించారు. మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో బుధవారం జిల్లా మత్స్యశాఖాధికారి సాంబశివరావుతో కలసి చేపపిల్లలను విడుదల చేశారు. అనంతరం లోనవెల్లి గ్రామంలోని దుబ్బగూడ కాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైన్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్(టీ) ఏఈ ఇర్ఫాన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారులను సస్పెండ్ చేయాలి..

అడవిపందిని హతమార్చిన కేసులో అత్యుత్సాహం ప్రదర్శించి, నిందితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సిర్పూర్(టీ) అటవీ శాఖ రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్, రెబ్బెన సెక్షన్ అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బెంగాలీక్యాంప్‌లో బాధితుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. అటవీ శాఖ అధికారుల తీరుతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అడవిపందిని హతమార్చిన కేసులో బెంగాలీ క్యాంప్‌నకు చెందిన ఏడుగురిని రిమాండ్‌కు తరలించారని పేర్కొన్నారు. అంతకుముందు వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, నోట్లో గుడ్డలు కుక్కి, కండ్లకు గంతలు కట్టి చిత్ర హింసలకు గురిచేశారని ఆరోపించారు. దీనిపై జాతీయ మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌కు సమగ్ర లేఖ రాయనున్నట్లు తెలిపారు. 48 గంటల్లో అటవీ అధికారులపై చర్యలు తీసుకోకపోతే సిర్పూర్(టీ) రేంజ్ కార్యాలయం ఎదుట వేలాది మంది రైతులతో నిరాహార దీక్ష చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఎల్ములే శంకర్, నాయకులు వోడ్డెని నానయ్య, నేరేళ్ల అశోక్, కిర్మరే శ్యాంరావ్, బండ రవి, రాజశేఖర్, బనార్కర్ సాయి, దుర్గం ప్రశాంత్ పాల్గొన్నారు.

మేమే సివిల్ పోలీస్..

- 13వ బెటాలియన్ కానిస్టేబుళ్ల దందా
- బెల్టు షాపుల్లో వీరిదే గిరాఖీ.. దాబాల్లో సిట్టింగులు

గుడిపేటలోని ఓ బెల్టు షాపులో సెల్ఫీ తీసుకుంటున్న కానిస్టేబుళ్లు, దాబాలో మద్యం సేవిస్తూ..

హాజీపూర్, అక్టోబర్ 30 : గుడిపేట 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ పోలీసులు సివిల్ పోలీసుల్లా వ్యవహరిస్తున్నారు. నిత్యం యూనిఫాంలో గ్రామంలో హల్చల్ చేస్తున్నారు. ఉదయం 5 గంటలకే ఆయా బెల్ట్ షాపుల్లో మద్యం తాగుతుంటారు. దాబాల్లో విందులు చేసుకుంటారు. మంగళవారం రాత్రి కొందరు బెటాలియన్ పోలీసులు పోలీస్ డ్రెస్‌లో దాబాలో మద్యం తాగడం హాట్ టాపిక్ అయింది. డ్యూటీ డ్రెస్సులోలనే మద్యం తాగడం పరిపాటిగా మారింది. హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ఆ పైస్థాయి ర్యాంక్ వారూ ఇందులో ఉన్నారు. డ్యూటీ డ్రెస్‌లోనే పలు ప్రైవేటు పంచాయతీలు చేస్తున్న సంఘటనలూ ఉన్నాయి.

ఎన్యుమరేటర్లకు సర్వేపై అవగాహన

జైపూర్, అక్టోబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వే (సమగ్ర కుటుంబ సర్వే)పై నియమించిన ఎన్యుమరేటర్లకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీసీఈవో, మండల ప్రత్యేకాధికారి గణపతి సర్వేపై సమగ్ర సమాచారాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో శ్రీపతిబాపురావు, ఆయా గ్రామాల కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై బీఆర్ఎస్ పోరాటం

- ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినం
- జిల్లాలో నాయకుల సంబురాలు
- పటాకులు కాల్చి.. స్వీట్లు పంచి..

బీఆర్ఎస్ పార్టీ పోరాటం వల్లే రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని విరమించుకున్నదని నాయకులు స్పష్టం చేశారు. ప్రజలపై రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారం పడకుండా ఆపడంలో విజయం సాధించినందుకు గాను బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో నాయకులు పటాకులు పేల్చారు. స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీల భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామన్నారు. ప్రజా సమస్యలపై పోరాటంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎప్పుడూ ముందుంటామని పేర్కొన్నారు.

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్30 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే కోవ లక్ష్మి పటాకులు పేల్చారు. సంబురాలు చేశారు. అనంతరం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం ఎల్లవేళలా బీఆర్ఎస్ సిద్ధంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఏ హామీ పూర్తి చేయలేక పోయిందని ఆరోపించారు. ఓవైపు ఉచిత విద్యుత్ అని ప్రకటిస్తూనే మరోవైపు చార్జీలు పెంచి భారం మోపడానికి ప్రయత్నాలు చేస్తున్నదని మండిపడ్డారు. గ్రామాల్లో ఉచిత విద్యుత్ అమలుకావడం లేదని, తాము పర్యటనకు వెళ్లిన సందర్భంలో అనేక మంది విన్నవిస్తున్నారని తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య, పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్, మాజీ సర్పంచు లు భీమేశ్, బలరాం నాయక్, లక్ష్మణ్, బాబురావ్, నాయకులు అహ్మద్, నిస్సార్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ టౌన్ : పటాకులు కాల్చుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 30 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచలేదని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే కాంగ్రెస్ విద్యుత్ చార్జీలు పెంచి, ప్రజలపై కోట్ల భారం మోపాలని ప్రయత్నించిందని ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపును ఈఆర్సీ ముందు బీఆర్ఎస్ బలంగా వ్యతిరేకించిందనిన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకను విని పించి విజయం సాధించడం చారిత్రాత్మక మని పేర్కొన్నారు. ఇదంతా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సాధించిన విజయమని, ప్రజలకు అండగా బీఆర్ఎస్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నల్మాస కాంతయ్య, బీఆర్ఎస్ నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, అంకం నరేశ్, ఎర్రం తిరుపతి, రాజు, పెంట ప్రదీప్, రమేశ్ యాదవ్, పడాల రవీందర్ పాల్గొన్నారు.

చెన్నూర్, అక్టోబర్ 30 : చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు పటాకులు కాల్చారు. స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే విద్యుత్ చార్జీల పెంపును నిర్ణయించిందని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంగా వాటిని వ్యతిరేకించాలని పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని ఈఆర్సీని ఒప్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ వైస్ చైర్మన్ నవాజుద్దీన్, కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, తుమ్మ రమేశ్, దొమకొండ అనిల్, వేల్పుల సుధాకర్, కోటపల్లి సింగిల్ విండో చైర్మన్ సాంబగౌడ్, పార్టీ కోటపల్లి మండలాధ్యక్షుడు ఎరినాగుల ఓదెలు, మండల యూత్ అధ్యక్షుడు విద్యాసాగర్, మాజీ ఎంపీపీ మంత్రి బాపు, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, రైతు బంధు సమితి మండల మాజీ కన్వీనర్ రత్న సమ్మిరెడ్డి, నాయకులు మేడ సురేశ్‌రెడ్డి, జడల మల్లేశ్, నాయిని సతీశ్, అరీఫ్, కొప్పుల రవి, నయాబ్, ఆశిష్, గోదారి రమేశ్, భారతి, ముత్యాల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి, అక్టోబర్ 30 : కోటపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు స్వీట్లు పంచుకున్నారు. ఇక్కడ కోటపల్లి మండల పీఏసీఎస్ చైర్మన్ పెద్దపోలు సాంబాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎరినాగుల ఓదెలు, మండల యూత్ అధ్యక్షుడు మారిశెట్టి విద్యాసాగర్, నాయకులు తిరుపతి రావు, మారిశెట్టి మల్లయ్య, కొట్టె నారాయణ, రాళ్లబండి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

107 దరఖాస్తులు.. 99 పర్మిషన్లు

- అమ్మకాలకు సిద్ధమైన పటాకుల దుకాణాలు
- అనుమతులు తప్పనిసరి అంటున్న అధికారులు
- షాపుల ఏర్పాటు పర్మిషన్లలో ఓ వ్యాపారి చేతివాటం..!

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 29 : వెలుగుల పండుగ దీపావళి.. పటాకులు కాల్చడం యేటా సంప్రదాయంగా వస్తున్నది. ఈ నేపథ్యంలో మంచిర్యాలలోని కాలేజ్‌రోడ్డులో నిర్వాహకులు బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. తాత్కాలికంగా ఏర్పాటుచేసేందుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు 107 దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోగా, 99 దుకాణాలకు మాత్రమే పర్మిషన్లు ఇచినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. కాగా, ఓ వ్యాపారి దుకాణాల పర్మిషన్లలో చేతివాటం ప్రదర్శిస్తున్నాడని, అన్నీ తానై తతంగం నడిపిస్తున్నాడన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మంచిర్యాల కాలేజ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన పటాకుల తాత్కాలిక దుకాణాలు

అనుమతులు, జాగ్రత్తలు తప్పనిసరి..

జిల్లాలో కొన్ని దుకాణాలకు మాత్రమే శాశ్వత అనుమతులు ఉండగా, ఏడాదిలో 15 రోజుల పాటు విక్రయాలకు అధికారులు తాత్కాలిక అనుమతులను ఇస్తుంటారు. ఇందుకు ముందుగా విక్రయదారులు ఆన్‌లైన్‌లో రూ.500 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. అగ్నిమాపక శాఖ అధికారులు పరిశీలించి, అనుమతులు జారీచేస్తారు. దాని ఆధారంగా సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పోలీసులు క్షేత్రపరిశీలన చేసి, సక్రమంగా ఉంటే ఎన్‌వోసీ జారీ చేస్తారు. ఆ రెండు ఎన్‌వోసీల ఆధారంగా స్థానిక సంస్థల అధికారులు మరోమారు క్షేత్ర పరిశీలన చేసి, ఎన్‌వోసీ ఇస్తారు. మూడు శాఖల అనుమతులు పొందాకే విక్రయాలు ప్రారంభించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో 107 దరఖాస్తులు రాగా, మంచిర్యాల పట్టణంలో 38, బెల్లంపల్లిలో 51, చెన్నూర్, లక్షెటిపేట, జన్నారంలో 10 దుకాణాలకు పర్మిషన్లు ఇవ్వగా, మిగితా 8 దరఖాస్తులను అగ్నిమాపకశాఖ తిరస్కరించింది.

చక్రం తిప్పుతున్న వ్యాపారీ..!

దుకాణాల అనుమతులకు మంచిర్యాలలో భారీగా ముడుపులు చెల్లిస్తున్నట్లు సమాచారం. తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక శాఖాల నుంచి అనుమతులు తీసుకోవాల్సింటుంది. అన్ని కార్యాలయాల చుట్టూ తిరుగలేక ఒక్కో దుకాణానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ముడుపులు వసులు చేస్తూ పర్మిషన్లు ఇప్పిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి ముందుండి ఈ తతంగం నడిపిస్తున్నట్లు, అంతా తానే చూసుకుంటానని చెప్పి పర్మిషన్లు ఇప్పిస్తున్నట్లు పలువురు చర్చించుకోవడం గమనార్హం. మరోవైపు దుకాణాల అనుమతులు, ఏర్పాట్లకు భారీగా డబ్బు చెల్లించడంతో ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నారనే ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

❖ నిబంధనల మేరకే అనుమతులు..

జిల్లాలో బాణసంచా విక్రయాలకు అన్ని నిబంధనల మేరకే అనుమతులు ఇస్తున్నాం. తాత్కాలిక లైసెన్స్‌దారులు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలను తెలియజేస్తున్నాం. వ్యాపారులు విధిగా మున్సపిల్, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖల ద్వారా అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటాం. అనుమతుల విషయంలో అవకతవకలు జరిగినట్లు మా దృష్టికి తీసుకువస్తే కేసులు నమోదు చేస్తాం.

- మామిడి భగవాన్ రెడ్డి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి, మంచిర్యాల

మెరుగైన వైద్య సేవలు అందించాలి

దవాఖానలో తనిఖీ చేస్తున్న ఏరియా జీఎం శ్రీనివాస్

రెబ్బెన, అక్టోబర్ 30 : బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి దవాఖానలో మెరుగైన వైద్య సేవలు అందించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచాలని జీఎం ఎం శ్రీనివాస్ సిబ్బందిని ఆదేశించారు. ఏరియా దవాఖానను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలో చికిత్స పొందుతున్న వారికి మంచి ఆహారం అందించాలని, మెరుగైన సేవలు, దవాఖాన అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, ఖైరిగూడ పీవో మచ్చగిరి నరేందర్, సూపరింటెండెంట్ మధుకుమార్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైల్వే ఇంజినీర్ మృతి

బెల్లంపల్లి, అక్టోబర్ 30 : విద్యుదాఘాతంతో రైల్వే సివిల్ ఇంజినీర్ సాయి హిమాన్ష (30) మృతి చెందినట్లు టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకొని బెల్లంపల్లి రైల్వే కాలనీకి చెందిన హిమాన్ష తన క్వార్టర్‌లో మంగళవారం రాత్రి ఎలక్రికల్ విద్యుత్ దీపాలు అమర్చుతుండగా, ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. హిమాన్షకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

యువ ఉద్యోగులను ప్రోత్సహించాలి

మందమర్రి, అక్టోబర్ 30 : సింగరేణిలోని యువ ఉద్యోగులను క్రీడల్లో ప్రోత్సహించాలని మందమర్రి ఏరియా స్టోర్ ఇన్‌చార్జి పైడీశ్వర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ పేర్కొన్నారు. 60వ వార్షిక క్రీడల్లో భాగంగా స్థానిక సింగరేణి పాఠశాల ఆవరణలో బుధవారం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో నియర్ బై హాకీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రారంభించారు. విజేతలకు కోలిండియా పోటీల్లో పాల్గొని, సింగరేణి సత్తా చాటాలని ఆకాంక్షించారు. మందమర్రి గ్రూప్ విజేతగా, బెల్లంపల్లి గ్రూప్ రన్నర్‌గా నిలిచాయి. ఈ కార్యక్రమంలో క్రీడల గౌరవ కార్యదర్శి కార్తీక్, ఏఐటీయూసీ నాయకుడు కంది శ్రీనివాస్, అసిస్టెంట్ స్టోర్ సూపర్‌వైజర్ అశోక్, బాణయ్య, గాండ్ల సంపత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివ కృష్ణ, జనరల్ కేప్టెన్ శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పార్టీలకు సంబంధంలేని వారిని నియమించాలి

చెన్నూర్, అక్టోబర్ 30 : ఏ పార్టీకీ సంబంధం లేని వారిని ఇందిరమ్మ కమిటీల్లో నియమించాలని మున్సిపాల్ పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. చెన్నూర్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ అర్చనాగిల్డా అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ కమిటీల్లో సభ్యుల నియామకం అంశం చర్చకు రాగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణను పాలకవర్గ సభ్యులు సన్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజుద్దీన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జైనూర్, అక్టోబర్ 30 : జైనూర్ మండలం గుడమామడ గ్రామానికి చెందిన మర్సుకోల జ్ఞానేశ్వర్(24) బుధవారం పురుగుల మందు తాగి మృతి చెందాడని ఎస్ఐ సాగర్ తెలిపారు. గూడమామడకు చెందిన మర్సుకోల గంగారాంకు ముగ్గురు కొడుకులు మర్సుకోల విఠంరావ్, జ్ఞానేశ్వర్, శంకర్. విఠంరావ్‌కు ఇప్పటికే పెండ్లి అయ్యింది. కాగా, సోనాపూర్‌లో జరిగే దండారీ ఉత్సవాలకు వెళ్లేందుకు జ్ఞానేశ్వర్, శంకర్ గొడవపెట్టుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరు పురుగుల మందు తాగారు. తండ్రి గంగారాం వెంటనే ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే జ్ఞానేశ్వర్ మృతిచెందినట్లు నిర్ధారించారు. శంకర్‌కు వైద్యం అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురి అరెస్ట్

కాగజ్‌నగర్, అక్టోబర్ 30 : ఈజ్‌గాంలో 26వ తేదీన జరిగిన ఘటనలో మనీష్ మాణిక్ దాస్, డెబాశిష్ మండల్, బుద్దేశ్వర్ రాయ్‌ను బుధవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రామానుజం బుధవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి మరికొందరు పరారీలో ఉన్నారని, త్వరలోనే అరెస్టు చేస్తామని వెల్లడించారు. సమస్య ఉంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, సోషల్ మీడియాలో అనవసర పుకార్లు పుట్టిచ్చే వారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ ఎంఐఎం పార్టీ పట్టణాధ్యక్షుడు ఎండీ ముబీన్ డీఎస్పీకి విన్నవించారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

మందమర్రి, అక్టోబర్ 30 : కోటేశ్వర్‌రావుపల్లి గ్రామానికి చెందిన సైదం రాజమ్మ(63) బుధవారం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి వెనుకాల గల బాత్‌రూంకు వెళ్లి, తిరిగి వచ్చే క్రమంలో పక్కన గల బావిలో ప్రమాదవశాత్తు పడిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోర్టులో స్టే ఉండగా తొలగింపు సరికాదు

- బాధితుడు డీకొండ అన్నయ్య

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 30 : నస్పూర్‌లోని సర్వేనంబర్ 42లో కూల్చివేసిన ఐదంతస్తుల భవనానికి సంబంధించి స్క్రాప్‌ను హైకోర్టులో స్టే ఉండగా తరలింపునకు చర్యలు తీసుకోవడం సరికాదని యజమాని డీకొండ అన్నయ్య అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో గల ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించారని సెప్టెంబర్ 19న మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. అనంతరం స్క్రాప్‌ను తొలగించేందుకు టెండర్ వేశారు. దక్కించుకున్న కాంట్రాక్టర్ బుధవారం మూడు జేసీబీలతో స్థలానికి చేరుకోగా, విషయం తెలుసుకున్న బాధితుడు అన్నయ్య అడ్డుకున్నారు. స్క్రాప్ తరలింపు చేపట్టవద్దని, హైకోర్టులో స్టే ఉందని తెలిపారు. దీంతో కాంట్రాక్ట్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా అన్నయ్య మాట్లాడుతూ.. తనకు నోటీస్ ఇవ్వకుండానే మున్సిపల్ అధికారులు ఇలాంటి చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్‌పై సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కోర్టు ఆర్డర్ ఉండగా, ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. మున్సిపల్ అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఇద్దరిపై కేసు

బెల్లంపల్లి, అక్టోబర్ 30 : బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి, మనీషపై దాడి కేసు నమోదు చేసినట్లు తాళ్ల గురిజాల ఎస్ఐ రమేశ్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన మనీషతో రాజ్‌కుమార్‌కు గతంలో వివాహం జరిగింది. ఆరు నెలల క్రితం గొడవకావడంతో మనీష తల్లి రాజేశ్వరి ఇంట్లోనే ఉంటున్నది. బుధవారం ఉదయం కూతురు సాహన్ని రాజ్‌కుమార్ వద్దకు వెళ్లింది. మనీష, తల్లి రాజేశ్వరి గమనించి రాజ్‌కుమార్‌తో పాటు ఆయన తల్లిని తిట్టారు. దాడిచేశారు. రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు